క్లుప్తంగా

కమిషనర్ నగర పర్యటన



శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో ఇలిసిపురం, గుజరాతిపేట, బొందిలిపురం ప్రాంతాల్లో కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు బుధవారం పర్యటించారు. శ్రీకాకుళం నగరంలోని పలు ప్రాంతాల్లో శానిటేషన్, విద్యుద్దీకరణ, నీటి సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నగర ప్రజలు అనారోగ్యాలపాలవ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్‌తో పాటు హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ ఉన్నారు.

సేవలతో స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సేవలతో స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపు వస్తుందని, అందులో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఒకటని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రశంసాపత్రాన్ని జోన్ చైర్మన్ లయన్ పొన్నాడ రవి కుమార్ బుధవారం అందించారు. యోగాంధ్ర విజయవంతం చేసినందుకు వారు కలెక్టర్, జేసీలను అభినందించారు. కార్యక్రమంలో యోగా గురువు, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, యోగా గురువు తంగి స్వాతి, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన ఉపాధ్యక్షుడు ఉర్లం శివతేజ ఉన్నారు.

జీరో సైన్స్ లాబ్ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యా ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని, అందుకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జీరో సైన్స్ లాబ్ పైలట్ ప్రాజెక్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో టీచర్లు మరింత సులభంగా మాథ్స్, సైన్స్ బోధించడంలో జీరో సైన్స్‌లాబ్ డిజిటల్ ప్రయోగశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఒక నెల పాటు శ్రీకాకుళంలోని గవర్నమెంట్ స్కూళ్లలో పైలట్ ప్రాజెక్ట్ ద్వారా అధ్యయనం చేసి, ఆ ఫలితాల ఆధారంగా రాష్ట్రస్థాయిలో అమలు పరిచేందుకు విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎస్.శశిభూషన్, శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎడ్యు వన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో రామదేవు రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల తర్వాత బదిలీలు చేపట్టాలి



ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని మండల సచివాలయాల ఉద్యోగ సంఘం సభ్యులు పిట్టా హేమంత్, సాకేటి ప్రసాద్, అలుగోలు లక్ష్మీనారాయణ, కంది నగేష్, మొదలవలస పావని, మోహన్ గణేష్‌లు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీ ప్రక్రియ సాగించాలన్నారు. సచివాలయం ఉద్యోగస్తులు సొంత మండలాల్లో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బగాది అప్పలరాజు, అంపోలు అనూష, సాయి తదితరులు పాల్గొన్నారు.

జూలై 14 నుంచి జన్మాష్టమి పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పొన్నాడ బ్రిడ్జి వద్దనున్న ఇస్కాన్ మందిరంలో జూలై 14 నుంచి 19 వరకు విద్యార్థులకు ఇంటర్ స్కూల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి లక్ష్మీపతి గౌర్ దాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాల్లో జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జూలై 10వ తేదీలోగా పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

నడక యాతన..!

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- చెరువులను తలపిస్తున్న వైనం
- పల్లె పండగ పేరుతో హడావుడి
- పనుల్లో నిర్లక్ష్యంతో కష్టాలు



లావేరు మండలంలోని తాళ్లవలస నుంచి వేణుగోపాలపురం వరకు పరిస్థితి...



చెరువుని తలపిస్తున్న కమ్మసిగడాం నుంచి దేవరాపల్లి వెళ్లే రహదారి

రణస్థలం:

కూటమి పాలనలో చెప్పిన మాటలకు చేసిన పనులకు పొంతన లేకుండా పోతోంది. ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత పల్లె పండగ పేరుతో సీసీ, బీటీ రోడ్లు వేస్తామని చెప్పి ఎక్కడికక్కడే తవ్వి వదిలేశారు. కొబ్బరికాయలు కొట్టి, ఫొటోలకు ఫోజులు ఇచ్చి, ఉపన్యాసాలు దంచేసి వెళ్లిపోయారు. అలా వాళ్లు చేసిన శంకుస్థాపనలకు నెలలు గడుస్తున్నాయి కానీ తట్టెడు గ్రావెల్ పడిన దాఖలాలు కనిపించడం లేదు. కొత్త రోడ్లు వేస్తామని, ఉన్నవాటికి మరమ్మతులు చేస్తామని చెప్పి ప్రొక్లెయినర్‌తో తవ్వేసి అలానే వదిలేశారు. దీంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఫలితంగా ఈ



గుంతలమయంగా ఉన్న జేఆర్‌పురం నుంచి బండిపాలెం వెళ్లే రోడ్డు

రోడ్లలో కనీసం నడవడం కూడా సాధ్యమవ్వడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు ఇంకెన్నాళ్లో..?

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని రణస్థలం మండలంలో కమ్మ సిగడాం కూడలి నుంచి దేవరాపల్లి వరకు, జేఆర్‌పురం వేంకటేశ్వర కాలనీ నుంచి ఉప్పివలస మీదుగా వెంకటరావుపేట వరకు, సీతారాంపురం నుంచి పాపారావుపేట మీదుగా మీసాల బడి గ్రామం వరకు, రణస్థలం చెరువు కొమ్ము నుంచి నాగంపాలెం వరకు, రణస్థలం తహసీల్దార్ కార్యాలయం నుంచి లావేరు మండలంలోని వేణుగోపాలపురం వరకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అలాగే లావేరు మండలంలోని తాళ్లవలస నుంచి వేణుగోపాలపురం మీదుగా పిట్టపాలెం, గుమ్మడాం బీటీ రోడ్డు 7 కిలోమీటర్ల వరకు, బెజ్జిపురం హైవే నుంచి బుడతవలస గ్రామం వరకు, మురపాక నుంచి చిన్నయ్యపేట వరకు, గురుగుబిల్లి నుంచి బట్టుపాలెం వరకు ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. అదేవిధంగా ఎచ్చెర్ల మండలంలోని హైవే నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు, అజ్జరాం నుంచి సహాపురం వరకు, కొయ్యాం నుంచి బడివానిపేట వరకు, తోటపాలెం నుంచి కొత్తపేట వరకు, రుప్పపేట నుంచి బొంతలకోడూరు వరకు, జి.సిగడాం మండలంలోని గెదెలపేట నుంచి టీడీవలస వరకు, టీడీవలస, నక్కపేట, సంతవురిటి నుంచి సీతారాంపురం వరకు, గెడ్డకంచారం నుంచి గదపపేట వరకు, చంద్రపేట నుంచి గదపపాలెం వరకు రోడ్లు దారుణంగా ఉన్నాయి.

నరకప్రాయంగా ప్రయాణాలు

రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రయాణాలు నరకప్రాయంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా రోడ్లు వేయకుండా అలానే వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు బురదమయంగా ఉండడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల ఆటోలు ప్రయాణం చేయాలన్నా భయానక పరిస్థితులు ఉన్నాయి. బురద రోడ్ల వలన ద్విచక్ర వాహనదారులు ఎక్కడికక్కడే జారిపడిపోతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ అధ్వాన రోడ్ల పరిస్థితిని నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బాగు చేయాలి



రహదారులు వేస్తామని చెప్పి కూటమి నాయకులు ఎక్కడికక్కడే తవ్వి వదిలేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ దారుల్లో ప్రయాణాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే రహదారులు బాగు చేయాలి.

– సనపల నారాయణరావు, ఇబ్రహింబాద్, ఎచ్చెర్ల మండలం

అధ్వానంగా ఉన్నాయి



రహదారులన్నీ గుంతలమయంగా మారిపోయాయి. రోడ్లు వేస్తామని చెప్పిన నాయకులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు. కమ్మసిగడాం నుంచి దేవరాపల్లి వెళ్లాలంటే ప్రజలు నరకం చూస్తున్నారు. నియోజకవర్గంలో రహదారులు చాలా వరకు ఇలానే దర్శనమిస్తున్నాయి.

– పిన్నింటి సత్యంనాయుడు, జే.ఆర్.పురం, రణస్థలం మండలం

కొనసాగుతున్న సమ్మె



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి 42వ రోజుకి చేరింది. జోరువానను సైతం లెక్క చేయకుండా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచాలని కోరారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలి, ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లేదెలా..?



పాఠశాల చుట్టూ చేరిన మురుగునీరు



ప్రధాన రహదారిలో దుస్థితి...

జి.సిగడాం: మండలంలోని జగన్నాథవలస యూపీ పాఠశాల చుట్టూ మురుగునీరు చేరడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లే రోడ్లపై నీరు నిల్వ అవుతుండడంతో ప్రజలు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాలయం చుట్టూ ఇలా ఉంటే రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పాఠశాలకు వెళ్లే రహదారిని శుభ్రపర్చాలని కోరుతున్నారు.

డీసీసీ అధ్యక్షుడి తీరుతో పార్టీ నాశనం

- జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకుల ఆరోపణ



సమావేశం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు పనితీరుతో కాంగ్రెస్ పార్టీ నాశనమవుతుందని జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో బుధవారం శ్రీకాకుళం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు డీసీసీ అధ్యక్షుడిపై అనేక తీర్మానాలను ఆమోదించి పార్టీ అధిష్టానానికి పంపించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేయాల్సిన డీసీసీ అధ్యక్షుడు జిల్లాలో పార్టీ సీనియర్ నాయకులను పక్కనపెట్టి ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇటీవల పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటన గురించి తమకు సమాచారం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆయన పనితీరుపై పీసీసీ దర్యాప్తునకు పూనుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు శ్రీకాకుళం ఆర్థిక కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఇందిరా విజ్ఞాన్ భవన్ ట్రస్ట్ పేరుతో ఒక ట్రస్టు ఉండగా డీసీసీ అధ్యక్షుడు ఆ ట్రస్టును ఖాతరు చేయకుండా, ట్రస్టు సభ్యులకు ఏమాత్రం చెప్పకుండా ఇష్టానుసారంగా సుమారు రూ.20 లక్షల ఆర్థిక అరాచకానికి పాల్పడడం జరిగిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి సనపల అన్నాజీరావు తదితరుల పాల్గొన్నారు.

విద్యార్థులను బడులకు చేరవ చేయాలి



హెచ్‌ఎం సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న ఎంఈవో కృష్ణ

శ్రీకాకుళం న్యూకాలనీ: బడి బయట ఉన్న బాలలను బడులకు చేరవచేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాకుళం ఎంఈవో–2 ఎస్.కృష్ణ కోరారు. శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేట ఎంసీఈ స్కూల్‌లో 38 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించిన నేపథ్యంలో బుధవారం హెచ్‌ఎం పి.సూర్యప్రకాశరావును అభినందించారు. హెచ్‌ఎంను సత్కరించి, ఉపాధ్యాయుల పనితీరును మెచ్చుకున్నారు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

- ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఎస్‌ఈ కృష్ణమూర్తి

శ్రీకాకుళం అర్బన్:

పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని ఏపీ ట్రాన్స్–కో ఎస్‌ఈ కృష్ణమూర్తి సూచించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పథకంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ భారం నుంచి కొంతవరకు ఉపశమనం పొందడానికి పీఎం సూర్యఘర్ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దేశంలో ముందుగా కోటి కుటుంబాలకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసి సౌరశక్తి ద్వారా విద్యుత్‌ను అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని గతేడాది ప్రవేశ పెట్టారన్నారు. ప్రతీ గృహం పైకప్పులపై సౌర పలకాలను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ కూడా అందిస్తామని, దీనికోసం ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించామని వెల్లడించారు. జిల్లాలో ఇంతవరకు ఈ పథకం కింద 1599 కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, ఎస్.జోగినాయుడు, బీవీ రవిశంకర్, జి.లక్ష్మి, గుడ్ల జగ్గారావు, అంకడాల తవిటన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రణస్థలం: మండలంలో పైడి భీమవరం సబ్‌స్టేషన్ నిర్వహణ, ఇతర మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని నారువ, మెంటాడ, వరిసాం, పైడి భీమవరం పంచాయతీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆరుగురు కార్యదర్శులు బదిలీ

ఎచ్చెర్ల: మండలంలోని కేశవరావుపేట, ఇబ్రహీంబాద్–1, ఇబ్రహీంబాద్–2, కుప్పిలి–2, బడివానిపేట, కొయ్యాం గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎం.సురేష్, ఎ.కేశవరావు, బి.చలపతిరావు, రషీదాభేగం, సురబింధులు బదిలీ అయ్యారని ఎంపీడీవో హరిహరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే వేరే ప్రాంతాల నుంచి మండలంలోని పూడివలస, కేశవరావుపేట, బడివానిపేట, బుడగట్లపాలేం, కొత్తపేట, కొయ్యాం గ్రామాలకు వరుసగా బొడ్డేపల్లి విజయభాస్కరరావు, మొదవలస అనిల్, సబ్బీర్‌కుమార్, పి.ఈశ్వరరావు, రవికుమార్, ఎ.కేశవరావులు పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారని వెల్లడించారు

మొక్కల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలి

ఎచ్చెర్ల: ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మొక్కల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీవో హరిహరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం సిబ్బందితో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు గట్లు, రోడ్లకు ఇరువైపులా పెంచేందుకు మొక్కలు అందజేయనున్నామని తెలిపారు. మండలంలో 8,653 ఎరువుల గుంతలు తవ్వేందుకు ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. వీటిని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో శోభాదేవి, ఈశ్వరం తదితరులు పాల్గొన్నారు.

విజయ గణపతికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో విజయ గణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయ గణపతి ఆలయంలో బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

విస్తారంగా మొక్కజొన్న సాగు



జి.సిగడాం మండలంలోని మెట్టు ప్రాంతాల్లో విస్తారంగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారుగా 5 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. వర్షాలు అనుకూలిస్తే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

– జి.సిగడాం

పేద కుటుంబానికి చేయూత



శ్రీకాకుళం నగరానికి చెందిన ఉట్ల హేమంత్ లివర్ వ్యాధితో బాధపడుతుండడంతో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతోంది. దీంతో పోలిపిల్లి జయకిరణ్, కోవగణ వాసు, నల్ల గౌతమి, ఆర్మీ పూర్ణ చంద్రరావు, సురవరపు శ్రీలత, నంది ఉమాశంకర్‌లు తమ సొంత డబ్బులతో వంద కేజీల బియ్యాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతులమీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, నంది ఉమాశంకర్, బొట్టా సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

శంకర విజయంపై ప్రసంగం



సంతోష్ కుమార్‌ను సత్కరిస్తున్న విజయ గణపతి ఆలయ అర్చకులు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

శ్రీకాకుళం కల్చరల్: లోకానికి మంగళం, శుభం కలిగించడానికి ఆది శంకరాచార్యులు జన్మించారని మైసూరుకు చెందిన సంతోష్‌కుమార్ ఘనాపాటి అన్నారు. స్థానిక బాపూజీ కళా మందిర్‌లో శృంగేరి ఉభయ జగద్గురువుల పరిపూర్ణ అనుగ్రహంతో అహం బ్రహ్మస్మి సీఈవో పీఏ మురళి నిర్వహణలో నగరంలో రెండోసారి శంకర విజయంపై ప్రసంగాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం అంతం చేయాలనుకున్న కాపాలికుడిని శంకరులు ఏవిధంగా సంహరించారో వివరించారు. ముందుగా విజయగణపతి దేవాలయం అర్చకులు పెంట నగేష్ శర్మ స్వామివారిని జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో పెంట రామచంద్రశేఖరశర్మ, అహం బ్రహ్మస్మి వాలంటీర్ వాశిష్ఠ కార్తికేయశర్మ, గుమ్మా నగేష్, నిష్ఠల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సహకారం అందించాలని వినతి



ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌తో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

రణస్థలం: విశ్రాంత ఉద్యోగుల భవనం నిర్మించేందుకు ప్రభుత్వ సహకారం అందించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి విజ్ఞప్తి చేశారు. రణస్థలం, లావేరు మండలాలకు చెందిన సుమారు 400 మంది పెన్షనర్స్‌తో నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పిన్నింటి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మాడుగుల రామారావు, సహాయ కార్యదర్శి మన్నె కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నగర పార్టీ కమిటీ నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగర పార్టీ కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యక్షులుగా గన్ని రాజు, బగ్గు అసిరినాయుడు, ప్రధాన కార్యదర్శులుగా లావేటి హేమసుందరరావు, శిల్లా వైకుంఠం, నల్లబిల్లి భాను, సీపాన మహేంద్ర, జయం శ్రీను, కార్యదర్శులుగా కుప్పిలి రవిశంకర్, సీపాన హేమసుందరరావు, తెలుగు రమేష్, సర్పరాజ్ భాగ్య, గుంటముక్కల పాపారావు, పంకు ప్రసాద్, కొయ్యాన జగదీష్, గుర్రు రవియాదవ్, కోటిపల్లి మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బానాల దాలినాయుడు, బడ్డి వెంకటరావు, తంగి కుమార్, కంచరాన శంకరరావు, సింహాద్రి శ్రీను, పెంట వేణుగోపాల్, ఉంకిల ప్రసాద్, ఎచ్చెర్ల కృష్ణారావు, సాధు రమణమూర్తి, రంగాజీదేవ్, పంచిరెడ్డి సుదర్శనరావు, శోభన్, కిల్లి నాగు, గొడిగోటి రమేష్, వడ్డి చిన్నబాబు, ఉజ్వల శాంతారావు, హుస్సేన్, గుడ్ల దామోదరరావు, కొండాల గణేష్, బుంగ గంగాధర్, తాడి జయరామ్, పిల్లా కాంతారావు, జ్యోతిప్రసాద్, గద్దిబోయిన కృష్ణయాదవ్, గేదెల వెంకటరమణ, సవర చంద్రశేఖర్, మహేష్‌రెడ్డి, రెడ్డి జగన్నాథం, రావిల్లి చిన్నబాబు, కొయ్యాన శ్రీను, మైలపల్లి లత, నక్క శివస్వామి, గందమ్ శేఖర్, సీర యశ్వంత్, గార ఉదయ్‌కుమార్, కర్నేన హరి, మంత్రి కిషోర్, ఎం.రాము, వై.వెంకట, దుక్క సునీల్, సీపాన భాస్కరరావు, పిల్లా దాస్, ఉట్ల శ్రీను, నడుకూరి వరుణ్‌కుమార్, లుకలాపు గోవిందరావు, సాధు నాగు, బాన్న పవన్‌కుమార్, యడ్ల జానకిరామ్‌లను నియమించారు.